క్లుప్తంగా

సాక్షిగణపతి, జ్వాలా వీరభద్ర స్వామికి విశేష పూజలు


సాక్షిగణపతి


జ్వాలా వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, పుష్పార్చన జరిపించారు.

శాకాంబరీగా వాసవీమాత



శ్రీశైలంప్రాజెక్ట్: కూరగాయలు, ఆకు కూరలు, ఫలాలతో అలంకృతమైన వాసవీమాత బుధవారం శాకాంబరీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సున్నిపెంటలోని శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని వాసవీ మహిళా విభాగం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ డిపో మేనేజర్ మహేంద్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. జూన్ నెలలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు పి.ఎం. జ్యోతి, ఎస్.షఫీవుల్లా, కె.నాగన్న, ఎస్.మూర్తుజాబి, పి.చెన్నయ్య, వి.శీలయ్య, మోహన్, ఎస్.నాగరాజు, జి.ఎస్.ప్రతాప్, కె.గోవిందయ్య, జీఆర్ఎల్ రెడ్డిని అభినందించారు. అలాగే అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పి.దర్గయ్య, సి.శివారెడ్డి, పిఆర్‌సీ రెడ్డి, ఎస్.కె.వలీ, ఎం.కమ్రుద్దీన్, జి.స్వామన్నకు ప్రశంసా పత్రాలు అందించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ డిపోను లాభాల బాటలో నడిపించాలని పిలుపునిచ్చారు.

గో సంరక్షణనిధికి విరాళం


దాతను సత్కరిస్తున్న ఏఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి బుధవారం నెల్లూరుకు చెందిన పి.శివకృష్ణ కుటుంబం రూ.1,00,016 విరాళాన్ని ఏఈఓ జి.స్వాములకు అందజేశారు.ఈ సందర్భంగా దాతను దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదం, చిత్రపటం అందించి సత్కరించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి నటరాజు అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో వినాయకకౌత్వం, తాండవ నృత్యకరి, శివపంచాక్షరి, అఖిలాండేశ్వరి, అష్టలక్ష్మీ స్తోత్రం, శివతాండవం తదితర గీతాలు, అష్టకాలకు సాయి అద్వితీయ, మహాత్రయి, సుభిక్ష, శ్రీవల్లి, భరణి, అక్షిత, మోక్షిత, మన్విత, నారాయిణి, పావని తదితరులు నృత్యం చేశారు.

20 నుంచి లింగాలలో సరిగెత్తు

పాములపాడు: మండలంలోని లింగాల గ్రామంలో ఈ నెల 20, 21 తేదీల్లో బదార్ల స్వామి సరిగెత్తు వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం బాదర్ల స్వామి వారి పీరును చావిడిలో ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. 20వ తేదీ చిన్న సరిగెత్తు, 21న పెద్ద సరిగెత్తు వేడుకలు జరుగుతాయని చెప్పారు.

మద్యం సీసాలు స్వాధీనం

మహానంది: గోపవరం మెట్ట వద్ద శిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన నాగేశు వద్ద బుధవారం 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మద్యం సీసాలు తరలిస్తున్నాడే సమాచారం మేరకు దాడులు నిర్వహించి సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మిడుతూరు: గ్రామంలో నిర్వహిస్తున్న పీర్ల ఊరేగింపు సమయంలో తనపై దాడి చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన అందె దేవరాజును గ్రామానికి చెందిన భరత్ కుమార్, కౌశిక్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎర్రనాగుల యంగన్న బాణసంచా కాలుస్తుండగా కాలితో తన్నుతావా అంటూ దాడి చేశారని తెలిపారు. ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరోసారి చిరుత కలకలం

మహానంది: మహానందిలో మరోసారి చిరుత కలకలం రేపింది. వారం రోజులుగా మండలవాసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న చిరుత బుధవారం స్థానిక పార్వతిపురం కాలనీ సమీపంలోని అడవిలో పంది పిల్లను చంపేసింది. కాగా రాత్రి మరోసారి గాజులపల్లె వైపు మార్గంలో ఉన్న పాలేరు వాగు వద్ద కారుపై నుంచి దూకి అడవిలోకి పరుగు తీసినట్లు వాహనదారులు తెలిపారు. దీంతో అటువైపు వాహనాలు వెళ్లకుండా స్థానికులు వాహనదారులను అప్రమత్తం చేశారు.


పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


గాజులపల్లెలో పీర్ల ఊరేగింపు


పీర్లను ఎత్తుతున్న భక్తులు


పీర్ల పాదస్పర్శకోసం రోడ్డుపై వరపడిన భక్తులు

ముగిసిన మొహర్రం


పాములపాడు: పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు


తిమ్మాపురంలో పీర్ల గ్రామోత్సవం


బండిఆత్మకూరులో 30ఏళ్ల తర్వాత పీర్ల ఊరేగింపు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంతో పాటు వడ్లరామాపురం తదితర గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు ముగిశాయి. చావిళ్లో పీర్లకు ప్రత్యేక ఫాతె హాల్ నిర్వహించారు. సాయంత్రం పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా ఏటికి తరలించారు.

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలో మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామస్తులంతా ఐకమత్యంతో పండుగను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పీర్ల గ్రామోత్సవంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని మేళతాళాల మధ్య పీర్లను నిమజ్జనానికి తరలించారు. అలాగే.. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. బుధవారం రెండు మండలాల్లోని అన్ని గ్రామాల్లో పీర్లను మేళతాళాల మధ్య కులమతాలకు అతీతంగా గ్రామంలో ఊరేగించారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో ముప్పై ఏళ్ల తర్వాత మొహర్రం వేడుకలు జరుగుతుండటంతో వేలాది మంది పాల్గొన్నారు. పీర్ల ఉత్సవానికి ముందుకు వచ్చి బాధ్యతలు తీసుకున్న ఖుద్దూస్‌ఖాన్‌ను గ్రామస్తులు అభినందించి సన్మానించారు. ఎస్‌ఐలు నాగేంద్రప్రసాద్, మల్లికార్జున బందోబస్తు నిర్వహించారు.

పాములపాడు: మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలు ముగిశాయి. బుధవారం మండలంలోని జూటూరు, మిట్టకందాల, యర్రగూడూరు, బానుముక్కల గ్రామాల్లో పీర్ల చావిళ్ల వద్దకు భక్తులు చేరుకుని చక్కెర చదివింపులు చేశారు. పీర్ల నిమజ్జనాన్ని పురస్కరించుకుని యువకులు వివిధ రకాల వేషధారణలు వేశారు. మేళతాళాలు, భక్త జనసందోహం మధ్య ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.


పీర్లను ఏటికి సాగనంపుతున్న భక్తులు


ముసలిమడుగులో..

భక్తిశ్రద్ధలతో పీర్లను ఏటికి సాగనంపిన భక్తులు

జూపాడుబంగ్లా: మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున మండలంలోని తాటిపాడు, తంగడంచ, జూపాడుబంగ్లా, 80బన్నూరు, మండ్లెం, తర్తూరు గ్రామాల్లో పెద్దసరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దహుసేనాలం, చిన్నహుసేనాలం పీర్లను ఎత్తిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి భక్తుల పూజలు అందుకున్నారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆయా గ్రామాల్లోని పీర్లచావిడీల్లోని పెద్దహుసేనాలం, చిన్నహుసేనాలం, హసన్, హుసేన్, అలీ, అక్బర్ పీర్లను ఎత్తారు. గ్రామంలోని దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలతో పీర్లను ఏటికి సాగనంపారు. స్వామివార్ల పాదస్పర్శ తగిలితే రోగాలు మటుమాయం అవుతాయనే నమ్మకంతో భక్తులు రోడ్డుపై పడుకుని పాదస్పర్శ తగిలించుకున్నారు. గ్రామ సమీపంలోని కాల్వలో పీర్లను ఊడదీసుకుని పెట్టెలో పెట్టుకుని ముస్లింలు విషాదగీతాలను పాడుకుంటూ గ్రామానికి చేరుకున్నారు.

గ్రామాల్లో కోలాహలం


మిడుతూరులో..

మిడుతూరు: మండల కేంద్రంతో పాటు కలమందలపాడు, తిమ్మాపురం, ఉప్పలదడియ, 49- బన్నూరు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. స్థానిక పీర్లచావిడిలో కొలువుదీరిన మౌలాలి స్వామి, అలెగ్సర్ స్వామి పీర్లను గ్రామ పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు నూల ఘట్టాలు చల్లడంతోపాటు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


దుద్యాలలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

ఉత్సాహంగా పీర్ల ఊరేగింపు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల, పెద్దగుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలతోపాటు కొత్తపల్లి మండల కేంద్రంలో కులమతాలకు అతీతంగా మొహ్రం వేడుకలు జరుపుకున్నారు. పీర్ల చావిడి నుంచి పీర్లను ఊరేగింపుగా ఏటికి తరలించారు. ఈ సందర్భంగా యువకలు నృత్యాలు చేస్తూ రంగలు చల్లుకుంటూ సందడి చేశారు.

దక్షిణాయనం ఆరంభం

- మకరరాశి నుంచి కర్కాటకంలోకి సూర్యుడి ప్రవేశం



శ్రీశైలం: సూర్యుడు మకరరాశి నుంచి కర్కాటక రాశిలో ప్రవేశించాడు. సాయన, నిరయన, పద్ధతులతో సూర్య గమనాన్ని డిగ్రీలలో కొలుస్తారు. ఈ కాలంలో పగలు తక్కువ, రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది. ఈ నెల 16వ తేదీ నుంచి సూర్యుడు 91వ డిగ్రీల నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశిస్తాడు. క్రమంగా ఉత్తరం వైపు నుంచి భూమధ్య రేఖ వైపు కదులుతూ సెప్టెంబరు 23 నాటికి భూమధ్య రేఖ పైకి చేరుకుంటాడు. ఆ రోజు పగలు రాత్రి సమానంగా ఉంటాయి. అక్కడి నుంచి మకరరాశి వైపు కిందకి పయనిస్తాడు. ఈ నెల 16వ తేదీ నుంచి 6 నెలల పాటు సూర్యుడు దక్షిణం వైపునకు కదులుతాడు. నిర్ణయ సింధువు అనే గ్రంథంలో గాలవుడు అనే ప్రసిద్ధ పండితుడు సాయన సంక్రాంతిని కూడా పుణ్యకాలంగా చెప్పారు. 180 డిగ్రీల వద్ద శరద్రుతువు, 270 డిగ్రీల వద్ద ఉత్తరాయణం ఆరంభం అవుతుంది.

స్థిరరాశి చక్రం ఆధారంగా నిరయన పద్ధతిలో..

కర్కాటకరాశి స్థిర రాశి చక్రరీత్యా పునర్వసు నక్షత్రం నాలుగో పాదంతో దక్షిణాయనం ప్రారంభం అవుతుంది. మంగళవారం పునర్వసు నాలుగో పాదం సూర్యోదయానికి ముందే కాబట్టి దక్షిణాయనం ప్రారంభమైనట్లే. స్థిరరాశి చక్రం ఆధారంగా నిరయన పద్ధతిని మాత్రమే మన వైదిక సంకల్పాలకు స్వీకరించాలి.

– మార్కండేయ స్వామి, ప్రధాన అర్చకులు, శ్రీశైలం

సామాజిక తనిఖీ సమగ్రంగా జరిగేనా.?

- నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామ సభలు
- 23న బహిరంగ సభ

కొత్తపల్లి: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులపై ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం ముమ్మరంగా పర్యటించి వివరాలు సేకరించింది. మొత్తం 7357 కుటుంబాలకు జాబు కార్డులు ఉండగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 5576 కుటుంబాలు పనులకు హాజరయ్యాయి. సుమారు 10154 మంది పనులు చేయగా 318000 పనిదినాలు పూర్తి చేసుకున్నారు. మొత్తం 925 వర్కులకు గాను రూ. 8.5 కోట్లు అప్పటి ప్రభుత్వం ఖర్చుచేసింది. వీటిలో అవకతవకలు నిగ్గతేల్చేందుకు ఈనెల 10వ తేదీ నుంచి సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పనుపై ఆరా తీసింది. గురువారం నుంచి సామాజిక గ్రామస్తులు, కూలీలతో గ్రామసభలు ఏర్పాటు చేసి సేకరించిన సమాచారాన్ని వెల్లడించనుంది. గ్రామస్తుల సలహాలు తీసుకుని వాటిని సరిచేస్తారు. ఈ ప్రక్రియ పూర్తి అవ్వగానే జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారుల సమక్షంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది బహిరంగ సభ నిర్వహిస్తారు. ఇందులో ఏ అధికారి ఎంత మేరకు పనులు చేశారు? ఏంతమేరకు అవినీతి జరిగింది అన్న విషయాలను వెల్లడిస్తారు.


గువ్వలకుంట్ల గ్రామంలో సామాజిక తనిఖీ బృందం రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

పారదర్శకంగా జరిగేనా?

ఏడాది పనులపై సామాజిక తనిఖీ సమగ్రంగానే జరుగుతుందా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోట్లలో పనులు జరిగితే ఎంతమేర తప్పులు జరిగాయి, ఎంతమేరకు తనిఖీ బృందం నిగ్గుతెల్చుతారో అని జనం గుసగుస లాడుతున్నారు. గత సామాజిక తనిఖీలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.7,05,10,265 ప్రభుత్వం ఖర్చు చేసింది. తనిఖీ బృందం డైరెక్ట్ రికవరి ద్వారా రూ.7,123, జరిమానా ద్వారా రూ.23,500, కొలతల్లో తేడాల ద్వారా రూ.72,542, హర్టికల్చర్‌లో మొక్కలు లేకపోవడంతో రిప్లాంటేషన్ కింద రూ.75,216ను నిగ్గు తేల్చారు. ఈ ఏడాది జరిగిన ఉపాధి హామీ పథకంలో ఖర్చు అయిన రూ.8.5కోట్లలో ఏ మేరకు సామాజిక తనిఖీ బృందం రికవరీ చేస్తుందో చూడాలి.

కొత్త చట్టాలతో నేరాల అదుపు

శ్రీశైలం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలతో నేరాలకు అదుపు పడుతుందని శ్రీశైలం సీఐ ప్రసాదరావు తెలిపారు. గతేడాది డిసెంబర్ 25న కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) తీసుకొచ్చారన్నారు. బుధవారం 1 టౌన్ ఏఎస్ఐ, రైటర్, పోలీసులు, స్థానికులకు కొత్తచట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అరెస్ట్ అయితే 14 రోజుల్లోపు మాత్రమే కస్టడీ కోరే అవకాశముంటుందన్నారు. 40 రోజుల్లో తీర్పు, 60 రోజుల్లో అభియోగాలు నమోదు చేస్తామన్నారు. 3–7 ఏళ్ల లోపు శిక్షపడే కేసుల ఫిర్యాదులను 24 గంటల్లోనే నిందితులు, బాధితులకు ఎఫ్ఐఆర్ కాపీలను ఉచితంగా అందజేస్తామన్నారు. మైనర్‌పై సాముహిక అత్యాచారం చేసినట్లు ఆధారాలు లభిస్తే నిందితులకు జీవిత ఖైదు లేదా మరణ శిక్ష పడే అవకాశముందన్నారు. పోక్సో కేసుల్లో పోలీసులే కాకుండా మహిళా ప్రభుత్వ అధికారి ఎవరైనా వాంగ్మూలం నమోదు చేయవచ్చని చెప్పారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీ టీఎన్ఎస్) ద్వారా దేశంలోని అన్ని పోలీసు స్టేషన్లను అనుసంధానం చేశాని వివరించారు. దర్యాప్తు, న్యాయ విచారణ సమన్లు కూడా ఎస్ఎంఎస్ ద్వారా జారీ చేయొచ్చన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


కొవ్వొత్తుల ర్యాలీలో రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు: బాలికను హత్యాచారం చేసి ముగ్గురు మైనర్‌లు, శవాన్ని మాయం చేసిన నిందితుడి తండ్రి, పెద్దనాన్నను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు డిమాండ్ చేశారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై బాలిక ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జైలులో పెట్టి సౌకర్యాలు కల్పిస్తే ఏం భయం ఉంటుందన్నారు. ఏపీ సుధాకర్, ఉపేంద్రా, రామకృష్ణ, సుబ్బన్న, లింగస్వామి, స్వాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు


తర్తూరులో లక్ష్మీరంగనాథస్వామి


మహానందిలో తిరుమంజన పూజలు చేస్తున్న పండితులు


తూర్పు ప్రాతకోట నాగేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో ఓంకార సిద్ధేశ్వరస్వామి

జూపాడుబంగ్లా: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తర్తూరు, తరిగోపుల, తూడిచెర్ల, పారుమంచాల గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే తలంటు స్నానం ఆచరించి తర్తూరులోని శ్రీలక్ష్మీరంగనాథస్వామివారికి, తాటిపాడులో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివార్లకు, జూపాడుబంగ్లాలో శ్రీవెంకటేశ్వరస్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత, కొత్తముచ్చుమర్రి, అర్లపాడు, కొత్త ఎల్లాల, ఆంజనేయనగర్, బీరవోలు, సంకిరేణిపల్లె, పగిడ్యాల, కొత్త పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఎస్. ఘణపురం తదితర గ్రామాల్లోని తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పండుగ విశిష్టతను పురోహితులు భక్తులకు వినిపించారు.

మిడుతూరు: మండలంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి రోజున భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి తమ భక్తిని చాటుకున్నారు. ఆయా గ్రామాల్లో విశేష పూజలు జరిగాయి

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో తొలి ఏకాదశిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే భక్తులు వైష్ణ, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ఉపవాసదీక్షను చేపట్టారు. పలు ఆలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. శివాలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేపట్టారు.

ఓంకారంలో..

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామి వారికివిశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. సమీప గ్రామాల భక్తులతో పాటు పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

మహానందిలో..

మహానంది: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మహానందిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, వేదపండితులు హనుమంతశర్మ, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకర శర్మ ఆధ్వర్యంలో శ్రీ కామేశ్వరీదేవి,మహానందీశ్వరస్వామి, కోదండరాముల వారి మూలమూర్తులకు రుద్రాభిషేకం, ఖడ్గమాలార్చన, ఉత్సవమూర్తులకు తిరుమంజనం జరిపించారు.స్వామి, అమ్మవార్లకు కేవలం ఫలాలు మాత్రమే నివేదించారు. ఏఈఓలు ఎరమల మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు. .

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి

నందికొట్కూరు: రైతులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో వినతపత్రాలు అందజేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పక్కీర్‌సాహెబ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18, 19 తేదీల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో రైతులు, కౌలు రైతుల సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు పెట్టుబడికి ఇస్తామన్న రూ, 20 వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ. 2 లక్షల వరకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ అమలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే 1.50 కోట్ల మంది వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మద్దమ్మ ఉన్నారు.

20న శ్రీశైల గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లకు ఈ నెల 20వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించనున్నారు. పౌర్ణమి రోజున సంప్రదాయబద్ధంగా శ్రీశైల గిరిప్రదక్షిణ, భ్రమరాంబాదేవికి లక్ష కుంకుమార్చన పూజలు జరిపించనున్నారు. గిరిప్రదక్షిణ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని దేవస్థాన అధికారులు బుధవారం విజ్ఞప్తి చేశారు.

అచ్చంగా అలాగే..



నేలపైనున్న చెట్లు, నింగిలోని మబ్బులు, నీలాకాశం, భానుడి అరుణ వర్ణం నీటిలో ప్రతిబింబించిన అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. రెండు రోజులుగా వర్షాలతో మబ్బులు కమ్మిన ఆకాశంలో బుధవారం ఆదిత్యుడు దర్శనమిచ్చాడు. ఈ క్రమంలో సాయంసంధ్య వేళలో తిమ్మాపురం సమీపంలోని ఓ పంట పొలంలో వరి సాగు కోసం రైతు మడుల్లో నీటిని నింపగా ఆకాశం, ప్రకృతి అందం అందులో ప్రతిబింబించిన దృశ్యాన్ని సాక్షి కెమెరాలో బంధించింది. – మహానంది